సాక్షి జగిత్యాల

మంగళవారం। 13। జూన్। 2023



బోనాల పండుగ

కథలాపూర్ : మండలకేంద్రంలో సోమవారం దుర్గామాతా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోరుట్లరూరల్ : పైడిమడుగులో సోమవారం రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

గరిష్ఠం/కనిష్ఠం 39.0/30.0

వాతావరణం

పగలంతా ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: వివిధ సమస్యలతో బాధపడే వారికి సత్వర న్యాయం అందించేందుకు పోలీసు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఎస్పీ భాస్కర్ అన్నారు. స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22 మందితో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని సూచించారు. ఈసందర్భంగా భూ సమస్యలు, భార్యాభర్తల విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్ మోసాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

మెట్‌పల్లి పరిధిలోకి ఆరు మండలాలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో ఇటీవల ఏర్పాటు చేసిన సబ్ కోర్టు పరిధిలో ఆరు మండలాలను చేర్చారు. జగిత్యాల కోర్టు పరిధిలోని మెట్‌పల్లితోపాటు కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మేడిపల్లి మండలాలను కొత్తగా ఏర్పాటు చేసిన సబ్ కోర్టు పరిధిలోకి తీసుకొచ్చినట్లు జిల్లా మేజిస్ట్రేట్ నీలిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ బుధవారం ఇక్కడ బెంచ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాల పరిధిలోని కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మెజిస్ట్రేట్ సూచించారు.

మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ ఖాళీలు

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో అవర్లీ బేసడ్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగసుధారాణి సోమవారం తెలిపారు. టీజీటీ(తెలుగు), టీజీటీ(సైన్స్), టీజీటీ(హిందీ), సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులు డిగ్రీ, బీఈడీ, టెట్ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. పీజీటీ(ఇంగ్లిష్) కోసం ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 17లోపు అర్హత పత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు నైపుణ్యం, ఆసక్తిగల వ్యక్తులు ఈనెల 15లోపు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి



జిల్లా కేంద్రంలో బీడీ కార్మికుల ర్యాలీ

జగిత్యాలటౌన్: బీడీ కార్మికుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షల సాయం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధరూర్ క్యాంపు కోదండరామాలయం నుంచి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు రూ.2,016 జీవనభృతి చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన బీడీ కార్మికులకు ఈపీఎఫ్ కనీస పింఛన్ రూ.6,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 2వేల మంది బీడీ కార్మికులు పాల్గొన్నారు.

14నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెల 14వ తేదీ నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న హియరింగ్, 16న ఆర్థోపెడిక్, 21న ఎంఆర్, 23న ఆర్థోపెడిక్, 28న ఆర్థోపెడిక్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 27న దృష్టి లోపాలకు సంబంధించిన శిబిరాన్ని ధరూర్ క్యాంపులోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు మీసేవ రశీదు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.



- ఇవి బుగ్గారం మండలం మద్దునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని టాయిలెట్లు. స్కూల్ ప్రారంభమైనా మరమ్మతులు పూర్తికాలేదు. విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.



- ఇవి సారంగాపూర్ ప్రభుత్వ బడిలో అసంపూర్తిగా మిగిలిన టాయిలెట్లు. ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభమైనా వాటి పనులు ఇంకా పూర్తికాలేదు.



- మన ఊరు.. మన బడి కింద ఎంపికైన సారంగాపూర్ మండలం రంగపేట బడిలోని డిజిటల్ స్క్రీన్స్ ఇవి. అభివృద్ధి పనులు పూర్తికాలేదు. దీంతో డిజిటల్ స్క్రీన్స్‌ను ఇలా మూలన పడేశారు.



- ఇది బుగ్గారం జెడ్పీహెచ్‌ఎస్ డైనింగ్‌హాల్. నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. విద్యార్థులు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడక తప్పడం లేదు. నిర్మాణం పూర్తిచేయాలని అధికారులు ఆదేశిస్తున్నా కాంట్రాక్టర్ పెడచెవిన పెడుతున్నారు.



- ఇది మల్లాపూర్ ప్రాథమిక పాఠశాల. మన ఊరు.. మన బడి కింద ఎంపిక అయింది. తాగునీరు, హ్యాండ్‌వాష్, సంప్, చిన్న మరమ్మతుల కోసం రూ.29.06 లక్షలు మంజూరు అయ్యాయి. ఇప్పటికీ పనులు పూర్తికాలేదు.


మారని బడి.. అదే తరగతి

మరమ్మతులు దాటని టాయిలెట్లు

- పూర్తికాని టాయిలెట్ల పనులు
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- తొలిరోజు 45శాతం మంది విద్యార్థుల హాజరు
- జిల్లాలో 52శాతం యూనిఫాంలు అందజేత
- బడులకు చేరిన పుస్తకాలు 3,62,370
- పునఃప్రారంభమైన పాఠశాలలు



రాయికల్‌లో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



- ఇవి సారంగాపూర్ మండలం పెంబట్ల ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మంచినీటి నల్లాలు. ట్యాపుల ద్వారా మంచినీళ్లు రావడంతో విద్యార్థులు తొలిరోజు ఇలా దాహం తీర్చుకుంటూ కనిపించారు.

జిల్లా సమాచారం	
పాఠశాలలు	783
విద్యార్థుల సంఖ్య	65,632
మన ఊరు మన బడికి ఎంపికైన స్కూళ్లు	274
కేటాయించిన బడ్జెట్(రూ.కోట్లలో)	1.16
ఇప్పటివరకు పూర్తయిన స్కూళ్లు	29
బడిబాటలో నమోదైన విద్యార్థుల సంఖ్య	4,000

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃపారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంతగానే నమోదైంది. ఒకవైపు ఎండలు దంచికొట్టడం, మరోవైపు మొదటిరోజు ఎలాంటి విద్యాబోధన ఉండదనే భావనతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపించలేకపోయారని అధికారులు తెలిపారు. తొలిరోజు సుమారు 45శాతం విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. మరోవైపు.. ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక పద్ధతుల్లో విద్యాబోధన చేపట్టేందుకు ఉద్దేశించిన మన ఊరు.. మన బడి కింద ఎంపికైన 274 పాఠశాలల్లో కేవలం 29 బడుల్లోనే పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. మిగతా చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పేట్టు లేదు. స్కూళ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,16,33,099 మంజూరు చేసింది.

కొనసాగుతున్న బడిబాట..

- ఈనెల 3న ప్రారంభించిన బడిబాట ఈనెల 17వ తేదీ వరకు కొనసాగుతుంది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడీడు, బడిబయట ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 4 వేల మందికి ప్రవేశాలు కల్పించారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ప్రవేశాలు మరింత పెరుగుతాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

జిల్లాకు 3.99 లక్షల పుస్తకాలు

- జిల్లాకు 3,99,760 పుస్తకాలు కేటాయించారు. ఇప్పటి వరకు 3,62,370 పుస్తకాలు వచ్చాయి. వీటిని గోదాంల నుంచి ప్రతీ పాఠశాలకు చేరవేశామని అధికారులు తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం..

- ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించలేదు. పట్టణాల్లో మున్సిపల్, గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, బల్దియాలు, పంచాయతీల్లోనే కార్మికుల కొరత ఉండడంతో పాఠశాలలను పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులే పాఠశాలల ఆవరణలను శుభ్రం చేసుకుంటున్నారు.

బయోమెట్రిక్ హాజరుపై అనుమానాలు..

- ఉపాధ్యాయుల హాజరు నమోదు చేసేందుకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు అన్నిచోట్ల పనిచేశాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేదని, సిగ్నల్స్ అందడంలేదనే కారణాలతో కొన్నిచోట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. ఈసారి కూడా ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తితే ఈ ప్రక్రియలో హాజరు నమోదు కొనసాగుతుందా?, లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

52 శాతమే యూనిఫామ్స్..

- జిల్లాకు 1.42 లక్షల జతల యూనిఫాంలు మంజూరయ్యాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రెండు జతల చొప్పున వీటిని అందిస్తారు. కానీ, ఇప్పటివరకు 72 వేల జతలే(సుమారు 52శాతం) వచ్చాయి.



మెట్‌పల్లిలో హాజరైన విద్యార్థులు



చిల్వాకోడూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పిల్లలకు కార్పొరేట్ విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలతో కూడిన కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. బడిబాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే నాలుగు వేల మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. మన ఊరు.. మన బడి ద్వారా డిజిటల్ స్క్రీన్లు, డైనింగ్‌హాళ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాం. కొన్నిచోట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరికొన్నిచోట్ల ఆధునిక స్కూళ్లు అందుబాటులోకి వచ్చాయి.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో



బుగ్గారంలో హాజరైన విద్యార్థులు ముగ్గురే..



రాయికల్‌లో బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

తెలంగాణలో ఇచ్చేవి మోదీ బియ్యమే..

- కేసీఆర్ బియ్యం ఇవ్వడం లేదు
- బీజేపీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్ జవదేకర్
- హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్



వృద్ధురాలికి రేషన్ బియ్యం అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్, బండి సంజయ్‌కుమార్

మల్యాల(చొప్పదండి): 'వన్ నేషన్ – వన్ రేషన్' ప్రధానమంత్రి నరేంద్రమోదీ విధానమని కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసేవి కేసీఆర్ బియ్యం కాదని.. నరేంద్రమోదీ బియ్యమన్నారు. మూడేళ్లుగా 80 కోట్ల కుటుంబాలకు మోదీ ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోందని వెల్లడించారు. మోదీ దేశ ప్రజలే తన కుటుంబంగా భావిస్తారని తెలిపారు. సీఎం కేసీఆర్ తన కుటుంబమే పరివారంగా భావిస్తారని ఎద్దేవా చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట రెడ్డిఫంక్షన్ హాల్‌లో సోమవారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన సమావేశానికి ప్రకాశ్ జవదేకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యారు. తొలుత మల్యాలలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి, బియ్యం తీసుకుంటున్న వృద్ధురాలితో మాట్లాడారు. బియ్యాన్ని డబ్బులు ఇస్తున్నావా? అని అడుగగా.. మూడేళ్లుగా పైసా ఇవ్వకుండా ప్రతినెలా 6 కిలోల బియ్యం తీసుకుంటున్నానని వృద్ధురాలు సమాధానం ఇచ్చింది. బియ్యం మూటగట్టి వృద్ధురాలి తలపై పెట్టిన ప్రకాశ్ జవదేకర్, బండి సంజయ్.. అనంతరం ముత్యంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో లక్షలాది మందికి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.6వేల చొప్పున అందిస్తున్నామన్నారు. తెలంగాణలో 11లక్షల మందికి ఉజ్వల పథకం కింద వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు. 40 లక్షల మందికి ప్రధానమంత్రి జీవన్‌జీవన్ జ్యోతి బీమా అమలవుతోందని తెలిపారు. మోదీ పథకాలతో లబ్ధిపొందిన వారంతా 89198 47687 ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, బీజేపీకి మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ప్రతీఒక్క కార్యకర్త మూడు కుటుంబాలను కలిసి, లబ్ధిదారుల వీడియోలు తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేయాలని నిర్దేశించారు. పేదలతోపాటు కరీంనగర్ డెయిరీకి నరేంద్రమోదీ రూ.10కోట్ల లబ్ధి చేకూర్చారని అన్నారు. దేశవ్యాప్తంగా మోదీ ఉచితంగా కరోనా వ్యాక్సిన్ పంపిణీ చేశారని, కేసీఆర్ వ్యాక్సిన్ అంటే మద్యం అని ఎద్దేవా చేశారు. మోదీ కేబినేట్‌లో ఏ ఒక్క మంత్రిపైనా అవినీతి ఆరోపణలు లేవని, కేసీఆర్ మంత్రివర్గంలో అవినీతి ఆరోపణలు లేనిమంత్రులు లేరన్నారు. 2024లో బీజేపీ 14 ఎంపీ సీట్లు గెలుసుకోవడం ఖాయమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమించి, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ దానిని విస్మరించారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నేరెళ్ల శ్రావణ్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం

- డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

తిమ్మాపూర్: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను తరలించే వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,629 విద్యాసంస్థల బస్సులు ఉండగా ఇప్పటివరకు కేవలం 817 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. మిగిలిన 812 బస్సులు కూడా సంబంధిత రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. 15 ఏళ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పొద్దని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాలో 818బస్సులకు 468, పెద్దపల్లి జిల్లాలో 249 బస్సులకు 75, జగిత్యాల జిల్లాలో 427బస్సులకు 213, రాజన్న సిరిసిల్లలో 135 బస్సులకు 61బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని వివరించారు. మిగిలిన బస్సులు కూడా త్వరలో ఫిట్‌నెస్ చేసుకోవాలని తెలిపారు. త్వరలో విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని డీటీసీ తెలిపారు.

గీతకార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న భోగ శ్రావణి

రాయికల్(జగిత్యాల): కిష్టంపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఈత, తాటివనం కోల్పోయిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి డిమాండ్ చేశారు. కిష్టంపేటలో ఈత, తాటివనాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం నాయకులతో ఛాయ్‌పే చర్చ నిర్వహించారు. నాయకులు అన్నవేని వేణు, సురేశ్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానం



ధర్మపురి : 2కే రన్ ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా తదితరులు

- సాంఘి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ధర్మపురి: తొమ్మిదేళ్ల తెలంగాణ పాలనలో రాష్ట్రం సంక్షేమ రంగంలో అగ్రస్థానంలో నిలిచిందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్‌కుమార్ నేతృత్వంలో పట్టణంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. మంత్రితోపాటు ఎస్పీ భాస్కర్, కలెక్టర్ యాస్మిన్ బాషా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల్లో సగం మందికిపైగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారన్నారు. ధర్మపురి మేజర్ పంచాయతీని రూ.కోట్లు వెచ్చించి టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ మాట్లాడారు. సంబురాల్లో మంత్రి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నంది కూడలి వద్ద హైమాస్ట్ లైట్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదనపు కలెక్టర్ మకరంద్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా..



జగిత్యాలలో రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలక్రైం: రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ రన్ నిర్వహించామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 'తెలంగాణ రన్'ను ప్రారంభించి మాట్లాడారు. పోలీసు సేవలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, 2కే రన్ విజయవంతమైందన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆర్డీవో మాధురి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండేటి రాజుకు పురస్కారం



అవార్డు అందజేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లా కేంద్రానికి చెందిన కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ అధ్యక్షుడు గుండేటి రాజు కళావిశిష్ట పురస్కారం అందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాహితీవేత్త రాజుకు పురస్కారం లభించింది. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ శివారులో సోమవారం కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. లింగాపూర్‌కు చెందిన తీగల రాజేందర్ బైక్‌పై మెట్‌పల్లికి వెళ్తుండగా కారు ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో 108లో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కమాన్‌పూర్(మంథని):కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో కానిస్టేబుల్, ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాలు.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పోతుల అజయ్, గణేశ్ ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వస్తూ కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద సెంటనరీకాలనీకి చెందిన శనిగరపు సమ్మయ్య బైక్‌ను ఢీకొట్టాడు. అనంతరం ఇద్దరూ కలిసి సమ్మయ్యను చితకబాదారు. బాధితుడి కుమారుడు శనిగరపు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు అజయ్, గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంట రుణం రూ.2లక్షల్లోపే..

- పంట పొలం ఎంత ఉన్నా ఇచ్చేది అంతే..
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఉత్తర్వులు బేఖాతరు
- బ్యాంకు అధికారుల తీరుపై రైతుల నిరసన



జగిత్యాల శివారులోని తోటలో టమాట తెంపుతున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: వివిధ పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు బ్యాంకుల నుంచి పంట రుణం తీసుకుంటున్నారు. ఇందుకోసం ఏడాదిలోపు వడ్డీతో సహా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తయ్యాక కొత్త రుణం తీసుకుంటున్నారు. అయితే, కొందరు బ్యాంకర్లు వ్యవసాయ భూమి ఎంతఉన్నా.. రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు మించి రుణం మంజూరు చేసేందుకే పరిమితమవుతున్నాయి. బ్యాంకులు అందించిన రుణం సరిపోక రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

రుణ పరిమితి పెంచేందుకు ససేమిరా..

- జిల్లాలోని 90 శాతం మంది రైతులు తమ సమీప గ్రామాల బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుంటున్నారు.
- ఏటా రుణవాయిదాలు సక్రమంగా చెల్లిస్తూ బ్యాంకర్లతో నమ్మకంగా ఉంటున్నారు.
- ఇంత నమ్మకంగా ఉన్నా.. ఏటా పెరుగుతున్న పంట పెట్టుబడులకు అనుకూలంగా రుణ పరిమితి పెంచి ఇచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు.
- బ్యాంకర్లు సరిపోయేంత రుణం ఇవ్వకపోవడంతో చాలామంది రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.
- మరోవైపు.. రైతుకు ఎంత వ్యసాయ భూమి ఉన్నా.. రూ.లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకే పంట రుణం తీసుకునే పరిస్థితి ఏర్పడింది.
- పసుపు, పండ్లతోటలు వంటి వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు ఎక్కువ మొత్తంలో రుణం కావాలని అడిగితే.. నిబంధనలు ఒప్పుకోవని బ్యాంకర్లు లేనిపోని సాకులు చెబుతున్నారు.
- ఎక్కువ రుణం కావాలంటే భూమిని తనఖా పెట్టమంటుండటంతో చాలా మంది అన్నదాతలు అందుకు మనసొప్పక ఇచ్చిన రుణంతోనే సరిపెట్టుకుంటున్నారు.
- పిల్లల చదువుల కోసం, అనారోగ్యం వస్తే ఆస్పత్రుల ఖర్చుల కోసం తెలిసివారి వద్ద మళ్లీ అప్పులు తీసుకుంటున్నారు.

వ్యవసాయ భూమి ఎంతఉన్నా..

రైతులకు వ్యవసాయ భూమి ఎంతఉన్నా.. బ్యాంకర్లు రుణాలను తక్కువగానే ఇస్తున్నారు. వాస్తవంగా ఏటా ఆయా పంటలకు ఇవ్వాల్సిన రుణాన్ని బ్యాంకర్లతో కలిసి ప్రభుత్వం సీజన్‌కు ముందుగానే నిర్ణయిస్తుంది. ఆ మేరకు ఏ బ్యాంకరు కూడా రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదు. నిబంధనల సాకుతో రుణ పరిమితి పెంచేందుకు వెనుకంజ వేస్తున్నారు. పెరుగుతున్న పెట్టుబడుల నేపథ్యంలో బ్యాంకులు ఇచ్చే రుణం సరిపోక, రూ.2 లేదా రూ.3 వడ్డీకి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకుంటున్నారు. వాటిని తిరిగి చెల్లించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరికొందు గ్రూపులుగా ఏర్పడి చీటీలు వేస్తూ, వాటిని వేలం ద్వారా పాడుకుని ఆర్థిక సమస్యలు పరిష్కరించుకుంటున్నారు.

42 బ్యాంకుల ద్వారా రుణాలు..

ప్రస్తుత ఏడాది ప్రభుత్వం, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి కలిసి జిల్లాలో సాగు చేసే 42 పంటలకు ఇవ్వాల్సిన రుణ పరిమితి ప్రకటించాయి. జిల్లాలో సాగు చేసే పంటలు, వాటికి అయ్యే ఖర్చును బేరీజు వేసుకుని రుణ పరిమితి నిర్ణయించారు.

పంట రుణ పరిమితి ఇలా(రూ.లలో)	
వరి	4,2000 – 45,000
మొక్కజొన్న(నీటి వసతి)	30,000 – 34,000
మొక్కజొన్న(వర్షాధారం)	26,000 – 28,000
వేరుశెనగ(వర్షాధారం)	22,000 – 24,000
వేరుశెనగ(నీటి వసతి)	28,000 – 30,000
మిర్చి	70,000 – 80,000
కాటన్	38,000 – 40,000
పసుపు	75,000 – 80,000
చెరుకు	70,000 – 75,000
నువ్వు	18,000 – 20,000
కందులు	18,000 – 21,000
మల్బరీ	40,000 – 5,0000
టమాట	44,000 – 50,000
మామిడి	55,000 – 65,000
పెసర	18,000 – 21,000

లక్షకు మించి ఇవ్వడం లేదు



నాకు ఎనిమిది ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది. లక్ష రూపాయలు లేదంటే రెండు లక్షల రూపాయల వరకే పంట రుణం ఇస్తున్నరు. చాలామంది రైతులు ఏటా రుణవాయిదాలను సక్రమంగా కడుతున్నరు. ఇలాంటి వారికి అత్యధికంగా పంట రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఇది బ్యాంకుల బాధ్యత. ప్రభుత్వం జోక్యం చేసుకుని బ్యాంకర్లపై ఒత్తిడి పెంచాలె.

– అల్లూరి మహేందర్‌రెడ్డి, రైతు, వేంపేట, మెట్‌పల్లి

నిబంధనల మేరకు రుణాలు



వానాకాలం సీజన్‌కు అవసరమైన రుణాలను అన్ని బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. ఇప్పటికే కొందరు రైతులు పాత రుణాలు చెల్లించి కొత్తగా పంట రుణం తీసుకుంటున్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీరైతుకు పంట రుణం అందిస్తాం. రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించే వారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మేరకు ఎక్కువమొత్తంలో పంట రుణం అందజేస్తున్నాం.

– వెంకటరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్

ఏం సాధించారని సంబరాలు

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ప్రజలను మభ్యపెడుతూ సంబరాలు చేయడం కాదని, వాస్తవాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన దశాబ్దంలో దొర కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. చదువుకున్నోడికి నౌకరీ లేదు, చదువులేనోడికి కులవృత్తిలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో రూ.60వేల కోట్ల అప్పు ఉంటే.. ఇప్పుడు రూ.5,60,000 కోట్లకు చేరిందన్నారు. ధర్మారం మండలం స్తంభంపల్లిలో విత్తనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మాని రైతుల కోసం చెక్కెర ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇథనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ప్రతి క్వింటాల్‌కు తరుగు పేరున 5కిలోలు ఎక్కువ తూకంవేయడంతో రైతులు క్వింటాకు రూ.100 నష్టపోతున్నారని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇద్దరు సంక్షేమశాఖల మంత్రులున్నా జిల్లా ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ఆర్భాటాలు చేయడం ఆశ్చర్యకరంగా ఉందని, ఉద్యమ ఆకాంక్షలు ఏం నెరవేరాయో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రతీనియోజకవర్గానికి వందమంది చొప్పున దళితబంధుకు రూ.15.700 కోట్ల బడ్జెట్ శాసనసభలో ఆమోదం పొందినా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. నాయకులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో తొలిదశ ప్రవేశాల గడువు తేదీ ఈనెల 19వ తేదీ వరకు పొడిగించారని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆగస్టు – 2023 సెషన్ కోసం ఎన్సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్ శిక్షణ పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

పెగడపల్లి(ధర్మపురి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యాశాఖాధికారి(డీఈవో) జగన్మోహన్‌రెడ్డి సూచించారు. సుద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను డీఈవో పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో గల స్థితిగతులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని, ఆ దిశగా శ్రమించాలని అన్నారు. జీవితంలో మంచి విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అలాగే పదో తరగతి ఫలితాల్లో ప్రథమస్థానం సాధించినందుకు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రతీవిద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి ఏటా మంచి ఫలితాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంపత్, ఉపాధ్యాయులు కుమారాచారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా

- సమస్య పరిష్కరించాలని డిమాండ్
- పోలీసుస్టేషన్ ఎదుట మహిళల బైఠాయింపు
- రోడ్డుపై డ్రమ్ములు పెట్టి నిరసన



రోడ్డుపై డ్రమ్ములు పెట్టి నిరసన తెలుపుతున్న మహిళలు

ధర్మపురి: 'నాలుగు రోజుల నుంచి తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నం.. అసలే ఎండాకాలం.. దాహం దహించి వేస్తోంది.. ఎలా బతకమంటారు?' అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఎస్సీకాలనీకి నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. పైపులైన్లలో ఏదైనా సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారానైనా తాగునీరు సరఫరా చేయాలని అధికారులకు చాలాసార్లు మొరపెట్టుకున్నారు. అయినా, తమ వేదనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ కాలనీకి చెందిన మహిళలు ధ్వజమెత్తారు. అధికారులు, నాయకుల తీరుకు నిరసనగా సుమారు 50 మంది మహిళలు.. ఖాళీ డ్రమ్ములను పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై పెట్టి ధర్నా చేశారు. సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రమ్ములు తొలగించారు. ట్యాంకర్ ద్వారా నీరందిస్తామని పోలీసులు తెలపడంతో మహిళలు శాంతించారు. మిషన్ భగీరథ ద్వారా పట్టణ ప్రజలకు రెండు, మూడు రోజులకోసారి నల్లానీరు సరఫరా అవుతోందని, ఇది సరిపోవడం లేదని మహిళలు ఆవేదన చెందారు.

జిల్లెల్లలో బొడ్రాయి ప్రతిష్ఠ ఏర్పాట్లు



జిల్లెల్లలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఏర్పాట్లను సోమవారం గ్రామ నాయకులు పరిశీలించారు. ఇప్పటికే బొడ్రాయిని గ్రామంలోకి తరలించగా ఆలయ సమీపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బొడ్రాయికి పూజలు చేసి నీళ్లతో అభిషేకించారు. సింగిల్‌విండ్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, నాయకులు ఆసరి బాలరాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్‌లు దొంగతనం చేసిన ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన ఈశ్వర్‌ప్రసాద్, దుర్గారావులను పెట్రోలింగ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై గతంలో దొంగతనాల కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసు అధికారిపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు

- డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్లక్రైం: నిరుపేద రైతును ముస్తాబాద్ ఎస్సై కొట్టారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలంలోని సేవలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవి కుటుంబ సభ్యులకు, ధరంసోత్ బాలరాజ్ కుటుంబ సభ్యులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ గురుంచి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయకుండా ధరంసోత్ రవి అతని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ముస్తాబాద్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద రోడ్డుపై కూర్చున్నారు. పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న ముస్తాబాద్ ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని.. రవిని కాపాడాలనే ఉద్దేశ్యంతో అతని చేతిలో ఉన్న మందు డబ్బాను గుంజుకున్నాడే కానీ చేయి చేసుకోలేదని స్పష్టం చేశారు. దీన్ని కొందరు సోషల్ మీడియాలో చెడుగా చూపిస్తూ పోలీసులు దాడి చేశారని, రైతును కొట్టి లాక్కెళ్లారని పోలీసులు తప్పు చేసినట్లుగా వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఎదునూరి భాను, గజ్జెల రాజు, రంజాని నరేశ్, పెద్దాని మహేందర్ ప్రచారం చేశారు. అసత్య ప్రచారాలు చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోంది



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో సోమవారం జరిగిన పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధరణితో రైతులకు ఇబ్బంది

- వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి నగేశ్

వీణవంక: ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ధరణిపై సీఎం మాటలు పచ్చి అబద్ధాలని వైఎస్సార్ టీపీ అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. రెవన్యూ వ్యవస్థలో సీఎం కేసీఆర్ కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని, ధరణి వల్ల రైతులకు మేలు కన్నా తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి కారణంగా 20లక్షల మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 18లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. ధరణి సమస్యలపై బహిరంగా చర్చకు సీఎం కేసీఆర్ వచ్చే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. సీఎం సొంత జిల్లాలోనే ధరణి కష్టాలు అధికంగా ఉన్నాయని ఆరోపించారు.